క్లుప్తంగా

అందుబాటులో గడ్డి విత్తనాలు

వీపనగండ్ల: సబ్సిడీ గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల ఇన్‌చార్జి వైద్యాధికారి శ్యామ్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎస్‌హెచ్‌ 24, ఎంఎఫ్‌ హైబ్రిడ్‌ 500 కేజీలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 5 కేజీల బస్తా రాయితీ పోను రూ. 130 విక్రయించనున్నట్లు తెలిపారు. అవసరమున్న రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌ జిరాక్స్‌ తీసుకువచ్చి, గడ్డి విత్తనాలు తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

కాంగ్రెస్‌ పార్టీలో చేరిక



పెబ్బేరు రూరల్‌: వనపర్తి మండలం దత్తాయిపల్లికి చెందిన బీఆర్‌ఎస్‌ నాయకుడు, మాజీ సర్పంచ్‌ దేవేందర్‌ నాయుడు, పెద్దతండాకు చెందిన రాజునాయక్‌ ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సోషల్‌ మీడియా కోఆర్డినేటర్‌ గడ్డం వినోద్‌యాదవ్‌ పాల్గొన్నారు.

పరామర్శ



కొత్తకోట రూరల్‌: ఆత్మకూర్‌కు చెందిన రైస్‌ మిల్‌ యజమాని వెంకటేష్‌గౌడ్‌ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. కొత్తకోట రైస్‌మిల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఆదివారం వెంకటేష్‌గౌడ్‌ కుటుంబ సభ్యులను ఉమ్మడి మహబూబ్‌నగర్‌ జిల్లా అసోసియేషన్‌ సభ్యులు పరామర్శించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా రైస్‌మిల్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి విశ్వనాథం, రమణ, దార హరినాథ్‌, శేఖర్‌రెడ్డి, కన్నయ్యశెట్టి పాల్గొన్నారు.

మైసమ్మ జాతరలో భక్తుల రద్దీ



పెద్దకొత్తపల్లి: నాయనోనిపల్లి మైసమ్మ జాతర ప్రాంగణం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పెబ్బేరు, వనపర్తి, నాగర్‌కర్నూల్‌, అచ్చంపేట, కొల్లాపూర్‌ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మైసమ్మ దేవతను కుటుంబసమేతంగా దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తినుబండారాలు కొనుగోలు చేశారు. భక్తుల రాకతో మండల కేంద్రంలో ట్రాఫిక్‌ సమస్య ఏర్పడి గంటలకొద్ది వాహనాలు రోడ్డుపై నిలిచిపోయాయి. ఎస్‌ఐ సతీష్‌ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

జోరుగా ఇసుక దందా..

దేవరకద్ర: మండలంలో జోరుగా ఇసుక దందా సాగుతోంది. గుట్టు చప్పుడు కాకుండా ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వార ఇసుకను పెద్ద ఎత్తున తరలిస్తున్నారు. కోయిల్‌సాగర్‌ వాగును గుల్ల చేస్తు ఇసుక దందాను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ పరంగా చేపట్టే పనుల కోసం అనుమతి తీసుకుని.. అవసరానికి మించి రాత్రివేళల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. పెద్దరాజమూర్‌, చిన్నరాజమూర్‌, గూరకొండ, పెద్ద గోప్లాపూర్‌ శివారులోని కోయిల్‌సాగర్‌ వాగు నుంచి నిత్యం ఈ వ్యవహారం సాగుతోంది. రెవెన్యూ అధికారులు, పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడంతో దందాకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని స్థానికులు అంటున్నారు. అదేవిధంగా చిన్న చింతకుంట మండల పరిధిలో ఉన్న వాగు నుంచి కూడా ఇసుక తరలింపు సాగుతోంది. రెండు నెలల క్రితం వాగులో దేవరకద్ర, చిన్నచింతకుంట మండలాలకు చెందిన ఇసుక దందా చేసే వారి మధ్య గొడవలు కూడా జరిగాయి. వెంకటాయపల్లి శివారుల్లో పెద్ద ఎత్తున మట్టిని తరలించి ఫిల్టర్‌ ఇసుకను తయారు చేస్తున్నారు. దీని వల్ల మట్టి దిబ్బలు మాయం అవుతున్నాయి. కొన్ని చోట్ల మట్టిని తీయడం వల్ల గోతులు ఏర్పడుతున్నాయి. దేవరకద్ర మండలం నుంచి మట్టిని తరలించి చౌదర్‌పల్లి సమీపంలోని మహబూబ్‌నగర్‌ రూరల్‌ మండలంలో ఫిల్టర్‌ ఇసుకను తయారు చేస్తున్నారు. దేవరకద్ర నుంచి మహబూబ్‌నగర్‌ వెళ్లే దారిలో ఫిల్టర్‌ ఇసుకను తయారు చేస్తున్నా ఎవరికీ పట్టక పోవడం ఆశ్చర్యం కలిస్తోందని ప్రజలు అంటున్నారు.



శంకుస్థాపనకే పరిమితం

- అప్పారెడ్డిపల్లి – ఆముదంబండ తండా బీటీరోడ్డుకు రూ. 4.70 కోట్లు మంజూరు
- రెండేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన అప్పటి మంత్రి నిరంజన్‌రెడ్డి
- పనులు ప్రారంభించని కాంట్రాక్టర్‌
- ప్రజలకు తప్పని అవస్థలు



అప్పారెడ్డిపల్లిలో రెండేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన శిలాఫలకం



పర్వతాపురం రోడ్డు

ఖిల్లాఘనపురం: మండలంలోని అప్పారెడ్డిపల్లి నుంచి ఆముదంబండ తండా వరకు బీటీరోడ్డు నిర్మాణానికి మోక్షం కలగడం లేదు. నిధులు మంజూరై సంవత్సరాలు గడుస్తున్నా.. శంకుస్థాపనకే పరిమితమైంది. కాంట్రాక్టర్‌ పనులు చేపట్టక పోవడంతో పలు గ్రామాలు, తండాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వానాకాలంలో అధ్వాన్నంగా మారే రహదారిపై రాకపోకలు సాగించలేక అవస్థలు పడుతున్నారు. బీటీరోడ్డు నిర్మాణాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోతున్నారు.

పీఎంజీఎస్‌వై నుంచి రూ. 4.70 కోట్లు..

మండల ప్రజల విజ్ఞప్తి మేరకు అప్పారెడ్డిపల్లి నుంచి పర్వతాపురం, గార్లబండతండా మీదుగా బీటీరోడ్డు నిర్మాణానికి పీఎంజీఎస్‌వై పథకం ద్వారా రూ. 4.70 కోట్లు మంజూరయ్యాయి. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్‌ పనులు చేపట్టక పోవడంతో ఆయా గ్రామాల ప్రజల కల కలగానే మారింది.

2 గ్రామాలు, 4 తండాలు..

బీటీరోడ్డు పనులు పూర్తయితే అప్పారెడ్డిపల్లి, పర్వతాపురం, షాపూర్‌ ఊరంచుతండా, ఆముదంబండ తండా, కోతులకుంట తండా, కర్నెతండాల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. అందుకుగాను మొత్తం 7.3 కిలోమీటర్ల బీటీరోడ్డు నిర్మాణంతో పాటు పర్వతాపురం శివారులో ప్రత్యేకంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణానికి 2021 జూన్‌ 8న అప్పటి వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. సంబంధిత కాంట్రాక్టర్‌ నేటికీ పనులు చేపట్టక పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మట్టిరోడ్డుతో ఇబ్బందులు పడుతున్నాం..



మా ఊరి నుంచి పర్వతాపురం మీదుగా ఆముదంబండ తండా వరకు మట్టి రోడ్డు ఉండటంతో ఇబ్బందులు పడుతున్నాం. బీటీ రోడ్డు మంజూరైందని రెండేళ్ల నుంచి చెబుతున్నారు కానీ, ఇప్పటికీ రోడ్డు నిర్మించలేదు. రోడ్డు పనులు ప్రారంభించి, త్వరగా పూర్తిచేయాలి.

– బాలపీరు, అప్పారెడ్డిపల్లి

ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, బీటీరోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈ విషయమై పంచాయతీరాజ్‌ డీఈని వివరణ కోరగా.. బీటీరోడ్డు నిర్మాణంపై ఇప్పటికే కాంట్రాక్టర్‌తో మాట్లాడినట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు.

కంకరపరిచి.. వదిలేశారు

పాన్‌గల్‌: అధికారుల పర్యవేక్షణ లోపం.. కాంట్రాక్టర్‌ నిర్లక్ష్యంతో నాలుగు గ్రామాల ప్రజలు రవాణా పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని కేతేపల్లి క్రాస్‌రోడ్డు నుంచి మంగళ్లపల్లి, ఆకునోనిపల్లి, ఆకునోనిపల్లెతండా మీదుగా దావాత్‌ఖాన్‌పల్లి వరకు రూ. 4 కోట్లతో నిర్మించే బీటీరోడ్డు పనులకు 2018 ఏప్రిల్‌ 13న ప్రస్తుత రాష్ట్ర ఎక్సైజ్‌, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేశారు. 7.5 కి.మీ. మేర బీటీ రోడ్డు నిర్మించాల్సి ఉండగా.. కేతేపల్లి నుంచి మంగళ్లపల్లి వరకు, దావాత్‌ఖాన్‌పల్లి నుంచి శాగాపూర్‌ క్రాస్‌రోడ్డు వరకు నిర్మాణం చేపట్టారు. ఆకునోనిపల్లె, ఆకునోనిపల్లె తండాల మధ్య 3.5 కి.మీ. రోడ్డుపై కంకరపరిచి, అసంపూర్తిగా వదిలివేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడేళ్ల క్రితం ప్రారంభించిన రోడ్డు పనులను పూర్తి చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అసంపూర్తి రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై పీఆర్‌ ఏఈ విద్యాసాగర్‌రెడ్డిని వివరణ కోరగా, చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో నిర్మాణంలో జాప్యం జరిగిందన్నారు. మరోమారు కాంట్రాక్టర్‌తో మాట్లాడి, పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఆకునోనిపల్లి వద్ద కంకరపరిచి వదిలివేసిన రోడ్డు

వర్గీకరణ సాధనే ఎమ్మార్పీఎస్‌ లక్ష్యం



ఆత్మకూర్‌లో ఎమ్మార్పీఎస్‌ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ఆత్మకూర్‌: ఎస్సీ వర్గీకరణ సాధనే ఎమ్మార్పీఎస్‌ లక్ష్యమని రాష్ట్ర కార్యదర్శి అజ్జపాగ లక్ష్మణ్‌, మండల అధ్యక్షుడు దండు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు కృష్ణమాదిగ అన్నారు. శనివారం ఆత్మకూర్‌లో ఎమ్మార్పీఎస్‌ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్‌ కట్‌చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్‌, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు రవికుమార్‌, మాసన్న, శ్రీను, బాలమన్యం, పాపారాయుడు, కురుమూర్తి, పరమేష్‌, రాజు, కురుమన్న, రేవల్లి శ్రీను, సోంబాబు, లక్ష్మీప్రసన్న, ప్రియాంక, రజని, పెంటమ్మ పాల్గొన్నారు.

పాన్‌గల్‌: ఎమ్మార్పీఎస్‌ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాన్‌గల్‌, గోప్లాపూర్‌ గ్రామాల్లో జెండా ఎగురవేశారు. ఈసందర్భంగా రాష్ట్ర నాయకుడు గంధం లక్ష్మయ్య మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ఆధ్వర్యంలో మాదిగల ఆత్మగౌరవ హక్కులు, ఎస్సీ వర్గీకరణ సాధన కోసం అలుపెరగని పోరాటాలు సాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దశరథం, రామకృష్ణ, మహేష్‌, వెంకటేష్‌, నర్సింహ్మా, మధు తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మాదిగల ఆత్మగౌరవాన్ని నిలబెట్టడం ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకే సాధ్యమైందని జిల్లా కార్యదర్శి మీసాల నాగరాజు అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్‌ జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధులు, వికలాంగులకు పింఛన్లు, ఆరోగ్యశ్రీ పథకం అమలులో మందకృష్ణ కీలకపాత్ర పోషించారని అన్నారు. కార్యక్రమంలో మంద నర్సింహ, నాగరాజు, రాములు, రవివర్మ, మీసాల శ్రీను, ఎల్లయ్య, గణేష్‌, నందీశ్వర్‌, కృపాకర్‌ పాల్గొన్నారు.



వీపనగండ్లలో..

వనపర్తిటౌన్‌: జిల్లా కేంద్రంలోని చేయూత ఆశ్రమంలో మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్‌ జాతీయ ఉపాధ్యక్షుడు గద్వాల కృష్ణ, కేశవులు, వెంకటయ్య, గంధం భగవంతు, ఆశ్రమం నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్‌ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, మల్లేష్‌, యాదయ్య, చంద్రయ్య, ఆంజనేయులు, కురుమయ్య, బుచ్చన్న, రాములు పాల్గొన్నారు.

అమరచింత: ఎమ్మార్పీఎస్‌ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ మాదిగ పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలో జెండా ఆవిష్కరించారు. అనంతరం కేక్‌ కట్‌ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్‌, మాసన్న, ప్రకాష్‌, ప్రేమ్‌కుమార్‌, బాలరాజు, దాసు, దామోదర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో దొంగల బెడద

పెబ్బేరు రూరల్‌: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కొత్త బస్టాండ్‌లో దొంగల బెడద నెలకొంది. రద్దీగా ఉండే బస్సులను ఎంచుకొని చోరీలకు పాల్పడుతున్నారు. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. బస్సు ఎక్కే హడావుడిలో ఉండే ప్రయాణికుల పర్సులు, సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్నారని పలువురు వాపో తున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు పోలీసు నిఘా ఉంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యార్థినులకు వైద్యపరీక్షలు

ఆత్మకూర్‌: మండలంలోని బాలకిష్టాపూర్‌ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులకు ఆదివారం డాక్టర్‌ వసంత వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్‌ వ్యాధుల బారిన పడకుండా విద్యార్థినులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. అనంతరం విద్యార్థినులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సురేష్‌కుమార్‌, సూపర్‌వైజర్‌ సురేందర్‌గౌడ్‌, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఈతవనం.. ఎదుగుదల శూన్యం

అమరచింత మండలం పాంరెడ్డిపల్లె శివారులో నాటిన ఈత మొక్కలు ఎదుగుదల అంతంతమాత్రంగా ఉంది. సుమారు ఎనిమిది ఎకరాల్లో 5 వేల మొక్కలు నాటారు. అమరచింత కల్లుగీత పారిశ్రామిక సంఘం నాలుగేళ్ల పాటు రూ. లక్ష 60వేలు వెచ్చించి, మొక్కల సంరక్షణకు కృషి చేసినా ఫలితం లేకుండాపోయింది. ప్రభుత్వం ఈతవనం సంరక్షణ కోసం బోరుమోటారు, కంచె ఏర్పాటు చేయడంతో పాటు ఉపాధి హామీ పథకం ద్వారా వాచర్‌ను నియమించాలని గీత కార్మికులు కోరుతున్నారు.

– అమరచింత



పరిహారం మంజూరుపై రైతుల హర్షం

పాన్‌గల్‌: మండలంలోని మాధరావుపల్లిలో ఎంజీకేఎల్‌ఐ డీ–8 కాల్వకు అనుబంధంగా నిర్మించిన మేజర్‌ 6 కాల్వలో భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం మంజూరు కావడంపై రైతులు హర్షం వ్యక్తంచేశారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్‌ సునీత, రాంచందర్‌ మాట్లాడుతూ.. గ్రామంలో 104 మందికి ఎకరాకు రూ. 5.80 లక్షల చొప్పున దాదాపు రూ. 3.70 కోట్ల నష్టపరిహారం మంజూరైనట్లు తెలిపారు. ఏడేళ్లుగా రైతులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారని.. మంత్రి జూపల్లి ప్రత్యేక చొరవతో నష్టపరిహారం మంజూరైందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు

మొదలైన పీర్ల పండగ సందడి

అమరచింత: గ్రామాల్లో పీర్ల పండగ సందడి ప్రారంభమైంది. ఆదివారం పట్టణంలోని పెద్దపీర్ల మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, పీర్ల పెట్టెను కిందకు దించారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మంగమ్మ పీర్ల చావిడి వద్ద ఆలంకు నమస్కరించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం క్యాలెండర్‌ ప్రకారం మొహర్రం నెల మొదటి రోజు నుంచి పది రోజుల పాటు పీర్ల పండగను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.



పెద్దపీర్ల మసీదులో పీర్ల పెట్టెను కిందకు దించుతున్న ముజావర్లు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మంగమ్మ

‘వ్యక్తిగత అక్కసు సరికాదు’

వనపర్తి: మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిపై ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్‌ జిల్లా మీడియా సెల్‌ కన్వీనర్‌ నందిమల్ల అశోక్‌ అన్నారు. ఆదివారం పట్టణ బీఆర్‌ఎస్‌ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాతీర్పును శిరసావహించి, తమ నాయకుడు నిత్యం ప్రజల్లో ఉండటంతో పాటు కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ, కేవలం విధానపరమైన విమర్శలు చేస్తున్నారన్నారు. నిరంజన్‌రెడ్డిపై ఎమ్మెల్యే అక్కసుతో మాట్లాడటం మానుకోవాలని డిమాండ్‌ చేశారు. ప్రతీ సారి తీహార్‌ జైలుకు పంపిస్తామనడమేగాని, ఆధారాలుంటే ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు పరంజ్యోతి, చిట్యాల రాము, ఎం.శ్రీను, తోట శ్రీను, కృష్ణయ్య, రాజు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కొత్తకోట రూరల్‌: మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తకోట సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలతో పాటు లైసెన్స్‌ కలిగి ఉండాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం తాగి వాహనం నడపరాదని తెలిపారు. రోడ్డు నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డ్రంకన్‌ డ్రైవ్‌తో పాటు హెల్మెంట్‌, నంబర్‌ ప్లేట్‌ లేని ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఖిల్లాఘనపురం: మహబూబ్‌నగర్‌కు చెందిన ఇబ్రహీం 1988–89లో ఖిల్లాఘనపురం బాలుర ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివాడు. ఇటీవల అతడు అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అతడి స్నేహితులు ఎమ్మెల్యే మేఘారెడ్డితో పాటు న్యాయవాది రామ్మోహన్‌ తదితర మిత్రబృందం ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ. 50వేల ఆర్థికసాయం అందజేశారు. తన మిత్రుడి పిల్లల చదువుకు అన్నివిధాలా సహకారం అందిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో శ్రీరాములు, తాజుద్దీన్‌, బాల్‌లింగం, బాలస్వామి పాల్గొన్నారు.



మిత్రుడి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

కొత్తకోట రూరల్‌: పట్టణానికి చెందిన వెంకటయ్య (50) శనివారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కొత్తకోట అంబాభవాని తాపీ కార్మిక సంఘం సభ్యులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ. 10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, నిక్సన్‌, జనార్దన్‌, ఆశన్న, రాములు, కురుమూర్తి, భాస్కర్‌, రాములు, రవి, ఆంజనేయులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్‌: శ్రీరంగాపురం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఈరపాగ అనురాధ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి రూ. 5 వేల ఆర్థికసాయం పంపించగా.. స్థానిక నాయకుడు బీరం రాజశేఖర్‌రెడ్డి ఆదివారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కొండయ్య, వెంకటస్వామి, శంకర్‌, చిన్నాగౌడ్‌, కురుమన్న, జే.ఆశన్న తదితరులు పాల్గొన్నారు.